సాక్షి
ములుగు
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

న్యూస్‌రీల్

విద్యుత్ అధికారుల 'పొలంబాట'



వెంకటాపురం(కె): మండలంలో విద్యుత్ శాఖ అధికారులు గురువారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీఈ ఆకిటి స్వామి రైతులకు వ్యవసాయ విద్యుత్ మోటార్లు, విద్యుత్ సరఫరా కెపాసిటర్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ సూర్య ప్రకాశ్, రైతులు పుల్లబొమ్మి బాలజీ, శ్యామల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వాజేడు: మండల పరిధిలోని మొరుమూరులో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్ రెడ్డి రూ.2లక్షల వరకు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తల్లాడి పుష్పలత, రాంబాబు, దుర్గారావు, శ్రీను, కాజావలి తదితరులు పాల్గొన్నారు.

జెండా పోల్‌లో చిక్కిన తాడు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జెండా ఆవిష్కరణ సమయంలో జెండా పోల్‌లో తాడు చిక్కుకు పోయింది. అది రాకపోవటంతో కొంత సేపు రెవెన్యూ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో పోల్ ఎక్కి తాడును సరిచేసి జెండాను ఎగురవేశారు.

విషజ్వరంతో మహిళ మృతి

వాజేడు: విషజ్వరంతో బాధపడుతూ మండల పరిధిలోని కొంగాల గ్రామానికి చెందిన మొడెం లక్ష్మి(27) భద్రాచలంలో మృతి చెందింది. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. బంధువులు కథనం ప్రకారం.. కొంగాల గ్రామానికి చెందిన మొడెం ప్రసాద్ భార్య లక్ష్మి నిండు గర్భిణి. తొమ్మిది రోజుల క్రితం జ్వరం రావడంతో వాజేడులో రెండు రోజులు వైద్యం చేయించుకుంది. జ్వరం తగ్గకపోవడంతో ఏటూరునాగారంలో మరో నాలుగు రోజులు వైద్యం చేయించుకుంది. జ్వర తీవ్రత అలాగే ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు వెళ్లగా రెండు రోజుల పాటు వైద్యులు చికిత్స అందించారు. అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆమెను అంబులెన్స్‌లో భద్రాచలానికి తరలించారు. లక్ష్మి నిండు గర్భిణి కావడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సిజేరియన్ చేసి బిడ్డను క్షేమంగా బయటకు తీశారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి మృతి చెందింది.

స్వచ్ఛభారత్



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయం వద్ద సీఆర్‌పీఎఫ్ 39వ బెటాలియన్ సిబ్బంది గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామప్ప ఆలయానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తీసి పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో 39వ బెటాలియన్ క్యాంపు కమాండెంట్ ఆర్‌కె పాండా, ద్వితీయ కమాండెంట్ రాజేష్ తివారీ, డిప్యూటీ కమాండెంట్ రజిత, ఇన్‌స్పెక్టర్లు హనుమంతరావు, రాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆంబ్రోస్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం

శరవేగంగా సమీకృత కలెక్టరేట్ భవనం పనులు

- లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాపాడుకున్నాం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- తంగేడు స్టేడియంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క



పరేడ్‌లో పాల్గొన్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్

ములుగు: జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా నూతన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పలు శాఖల తరఫున ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. మహిళా సంఘాలకు రూ.5కోట్ల చెక్కును అందజేశారు. ఎన్ఐటీ, ఐఐఐటీలో సీట్లు సాధించిన వారికి ల్యాప్‌టాప్‌లు, సపోర్ట్ స్కీంల ద్వారా చెక్కులను పంపిణీ చేశారు. స్వాతంత్య్ర సమరయోధులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతన సమీకృత కలెక్టరేట్ భవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. సమ్మక్క– సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, వైద్య కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రవాణా సౌకర్యం లేని మారుమూల గ్రామాల్లోని ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా నూతన ఆలోచనతో రెండు కంటైనర్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది వరదల కారణంగా జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కాపాడుకున్నామని తెలిపారు.

ఇంటింటా జ్వర సర్వేలు

సీజనల్ వ్యాధుల నిర్మూలనకు ఇంటింటా జ్వర సర్వేలు చేసి 1,46,408 మందిని పరీక్షించామని తెలిపారు. 31మలేరియా, 11డెంగీ కేసులను నిర్ధారించి వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించామని వివరించారు. గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్స్ జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణ, బొగత వాటర్ ఫాల్స్ దగ్గర ఏర్పాటు చేసినట్లు వివరించారు. త్వరలోనే మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం మైక్రో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆగస్టు 5నుంచి 9వ తేదీ వరకు చేపట్టిన కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజల సహకారంతో అన్ని గ్రామపంచాయతీలలో విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా 659కిలో మీటర్ల రోడ్లు, 346 కిలో మీటర్ల డ్రెయినేజీ కాల్వలు, 207 లోతట్టు ప్రాంతాల శుభ్రం, 117 శిథిలావస్థలో ఉన్న గృహాల తొలగింపు వంటి పనులు చేపట్టామన్నారు.

1,73,620 మొక్కల పంపిణీ

43,405 గృహాలకు 6 మొక్కల చొప్పున 1,73,620 మొక్కలు పంపిణీ చేశామని వివరించారు. 213 లొకేషన్లలో 57,205 మొక్కలు, కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో 1102 ప్రాంతాలలో 46,052 మొక్కలు, 284 విద్యా సంస్థలలో 18,975 మొక్కలను నాటామన్నారు. మొదటి, రెండవ విడతల్లో 19,644 రైతులకు రూ.137.41కోట్ల పంట రుణమాఫీ చేశామని 3వ విడతగా రూ.2లక్షల వరకు రుణమాఫీ గురువారం నుంచి ప్రారంభమైందన్నారు.

7.50లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ

దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా స్టేజ్ 1,2 కింద 7.50లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు. రామప్ప, లక్నవరం గ్రావిటీ కెనాల్ కోసం లక్నవరం సరస్సు కింద 8,700 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం రూ.14.53 కోట్లు మంజూరు చేశామని వివరించారు. ఈ వేడుకల్లో కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీజ(స్థానిక సంస్థలు), సీహెచ్ మహేందర్‌జీ(రెవెన్యూ),ఓఎస్డీ మహేష్ బాబా గీతే, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, స్వాతంత్య్ర సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు రూ.110కోట్లు

సమ్మక్క– సారలమ్మ మేడారం జాతరకు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.110 కోట్లు వెచ్చించి 1.50కోట్ల మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవంతంగా జాతరను ముగించుకున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందని వివరించారు. ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజుల్లోనే రెండు మానవీయ పథకాలను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరం అన్నారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో రూ.2కోట్లు, మంగపేటలో రూ.52 లక్షల నిధులతో మోడల్ బస్టాండ్, ఏటూరునాగారంలో రూ.4.5కోట్లతో నూతన బస్ డిపో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి



జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న పీఓ చిత్రామిశ్రా

స్వాతంత్య్ర దినోత్సవంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



గురుకుల స్పోర్ట్స్ పాఠశాల, కళాశాల స్కౌట్ విద్యార్థులతో పీఓ

ఏటూరునాగారం: ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా తెలిపారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పీఓ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్ఐటీ, ఐఐటీ విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన గిరిజన విద్యార్థులు 26 మందికి రూ.10.68 లక్షలు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేసినట్లు తెలిపారు. ఇటీవల మంత్రి సీతక్క 13మంది విద్యార్థులకు రూ.4.52 లక్షలను అందించినట్లు గుర్తుచేశారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ట్రైకార్ ఎమ్మెస్ ఎంఈ మత్స్య పారిశ్రామిక అభివృద్ధి, గిరి వికాసము, గిరిజన సహాయ నిధి, పోడు భూములు జీసీసీల వారీగా నిధులు కేటాయించి గిరిజనులు ఆయా రంగాల్లో అభివృద్ధి సాధించేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఏఓ రాంబాబు, ఎస్ఓ రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంస పత్రాలు - వివరాలు 8లో ▶

మూడో విడతలో రూ.735.27 కోట్ల రుణమాఫీ



హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడో విడతలో రూ.2 లక్షలలోపు రుణమాఫీ కింద రూ.735,27,34,584 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో రూ.లక్షన్నర లోపు రుణ మాఫీ చేసింది. గురువారం మూడో విడతలో భాగంగా రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56,704 రుణ ఖాతాల ద్వారా 44,462 కుటుంబాలు రుణమాఫీ పొందనున్నాయి. ఇందులో ములుగు జిల్లా వ్యాప్తంగా 4,833 రుణ ఖాతాల ద్వారా 3,829 కుటుంబాలకు రూ.63,29,83,391 రుణం మాఫీ కానుంది.

రామప్పలో భక్తుల సందడి



రామలింగేశ్వరున్ని దర్శించుకుంటున్న భక్తులు

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. స్వాతంత్య్ర దినోత్సవం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. రుద్రేశ్వరునికి అభిషేకం, అర్చన పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి హరీశ్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా..

టేకుమట్ల: మండలంలోని గుమ్మడవెల్లి గ్రామం చలివాగు శివారు నుంచి బుధవారం అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా స్థానికులు రెండు ట్రాక్టర్లను అడ్డుకుని డయల్ 100కు కాల్ చేశారు. స్పందించిన పోలీసులు గుమ్మడవెల్లికి చేరుకుని గురువారం ఉదయం రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని టేకుమట్ల చలివాగు వంతెనపై నిలిపారు. కానీ అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో పట్టుకున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు వదిలేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి లోడింగ్–పగలు డంపింగ్ చేసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిచడం పట్ల సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. అక్రమ ఇసుక రవాణాపై 100కు కాల్ చేసినా ఫలితం శూన్యమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి అక్రమంగా ఇసుకను యథేచ్ఛగా నియోజకవర్గంలోని ఇతర మండలాలకు రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బుధవారం రాత్రి ఇసుక అక్రమ రవాణాపై ఆర్ఐ సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు సమాచారం అందలేదన్నారు. స్థానిక అవసరాల కోసం ఇసుకను తీసుకునేందుకు పంచాయితీ కార్యదర్శి ధృవీకరణ అనంతరం తహసీల్దార్ అనుమతితో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల లోపు ఇసుకను తీసుకుపోవాలని అన్నారు.

మంత్రి సీతక్కకు ఆపరేటర్ల వినతి



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

మొగుళ్లపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు గురువారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సందీప్ మాట్లాడారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్లకు పే స్కేల్, ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్ అనే హోదాను కల్పించాలన్నారు. ఆపరేటర్లకు కూడా పేస్కేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రెటరీ జువ్వాడి సంధ్య, ఉపాధ్యక్షులు కొండారెడ్డి, టి స్వప్న, ములుగు జిల్లా అధ్యక్షుడు చింతల రంజిత్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు చింతకింది రమేష్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

కలెక్టర్ టీఎస్.దివాకర



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు: పలు రకాల ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. జిల్లా కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్లు, వైద్య సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ జ్వరాలతో ఆస్పత్రిలో ఎంత మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న పలు రకాల వైద్య సేవలపై ఆరా తీశారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా రోగులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, అందుబాటులో ఉన్న పరికరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సమయపాలన పాటిస్తూ విధులలో ఉండాలని సూచించారు. డెంగీ, మలేరియా వంటి ప్రమాదకర జ్వరాల బారిన పడిన రోగులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ కావాల్సిన మందులు, విషసర్పాలు, కుక్క కాటుకు అవసరమైన వ్యాక్సిన్లు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులను ఆదేశించారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. 100శాతం ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ జరగాలని, సకాలంలో టీకాలు అందజేయాలని అన్నారు. గర్భిణులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. డయాగ్నస్టిక్ హబ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, రోగులకు చేస్తున్న ప్రతీ పరీక్ష వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఓపీ సేవల్లో రోగులకు మరింత నాణ్యమైన వైద్యం అందించాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్యాజువాలిటీ, ప్రసూతి వార్డు, లేబర్ రూమ్, ప్లేట్‌లెట్ మిషన్, ఐసీయూ, జనరల్ వార్డులలో ఉన్న సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌లాల్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు బూట్ల పంపిణీ



బూట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులకు వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సతీష్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థినులకు బూట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. 78వ సాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కేజీబీవీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 100మంది విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నారాయణరాజు, ఏఎస్సై యాకుబ్‌పాషా ఉన్నారు.

రోడ్డుపై నిలిచిన లారీలు



ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

మల్హర్: మండలంలోని మల్లారం ఇసుక క్వారీకి ఇసుక కోసం వచ్చిన లారీలు నిలుపుకోడానికి స్థలం లేక రోడ్లపైనే ఎక్కడ పడితే అక్కడ నిలిపి ఉంచుతున్నారు. గురువారం ఈ క్వారీకి వందకు పైగా లారీలు రావడంతో మల్లారం ఫారెస్ట్ నర్సరీ నుంచి మల్లారం క్వారీ వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేర లారీలు నిలిచాయి. ఇసుక కోసం క్వారీలకు వెళ్లే లారీల కోసమే రోడ్లు అన్నట్లుగా మారిపోయాయి. లారీలు రోడ్డుపై నిలపడంతో తాడిచర్ల నుంచి కొయ్యూర్ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ లారీలతో గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై లారీలు నిలిచి ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీ నిర్వాహకులు రోడ్డు పై క్యూరింగ్ చేయకోవడంతో దుమ్ము, దూళితో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కేటీకే1 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీగా సదానందం



భూపాలపల్లి రూరల్: కేటీకే 1 ఇంక్‌లైన్ నూతన ఫిట్ సెక్రటరీగా ఆత్మకూరి సదానందంను ఎన్నుకున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, భూపాలపల్లి బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని కొమురయ్య భవన్‌లో గురువారం ఫిట్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్, రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ అనారోగ్య కారణాలతో బాధ్యతలు నిర్వర్తించలేకపోవడంతో సదానందంను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శ్రీనివాస్, రామచందర్, సుధాకర్ రెడ్డి, నూకల చంద్రమౌళి, తాళ్ల పోషం పాల్గొన్నారు.

కరెంట్ ఎప్పుడొస్తుంది సార్ అని అడిగితే..

- విద్యుత్ ఏఈ, సబ్ ఇంజనీర్ బూతుల పర్వం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

కాశిబుగ్గ: కాశిబుగ్గలో కరెంట్ ఎందుకు పోయింది.. ఎప్పుడోస్తది సార్ అని విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఓ క్యాజ్‌వల్ కార్మికుడు ఫోన్‌లో అడగగా 'నీకు నేను సమాధానం చెప్పాలా' అంటూ ఓ సబ్ స్టేషన్ ఏఈ బూతులతో ఫైరయ్యాడు. గురువారం కాశిబుగ్గలో జరిగిన ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. కొత్తపేటకు చెందిన కరుణాకర్‌రెడ్డి ఆరెపల్లి సబ్‌స్టేషన్‌లో క్యాజువల్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. దుస్తులు కొనుగోలు నిమిత్తం కాశిబుగ్గకు రాగా కరెంట్ పోయిందని ఆ షాపు నిర్వాహకులు చెప్పారు. దీంతో కరుణాకర్‌రెడ్డి నేను అడిగి తెలుసుకుంటానని ఫోన్‌లో మిల్స్ కాలనీ సబ్‌స్టేషన్ ఏఈకి కాల్ చేశాడు. దీంతో ఏఈ 'నువ్వు నాకు కాల్ చేస్తావా? కాంట్రాక్ట్ లేబర్‌వి.. నీకు నేను సమాధానం చెప్పాలా' అంటూ బూతులు తిట్టాడు. దీంతో కరుణాకర్‌రెడ్డి కూడా ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయం ఏఈ.. గొర్రెకుంటలోని సబ్ ఇంజనీర్‌కు చెప్పడంతో ఆయన, ఏఈ.. మళ్లీ కరుణాకర్‌రెడ్డికి ఫోన్ చేసి ఓ అధికారితో అలా మాట్లాడుతావా అంటూ ఫోన్‌లో బూతులు తిడుతూ బెదిరింపులకు దిగారు. దీనికి కరుణాకర్‌రెడ్డి నేను కరెంట్ విషయం గురించి అడిగితే అధికారి బూతులు తిడతారా? సామాన్యులకు సమాధానం చెప్పరా అంటూ వాగ్వాదం చేశారు. దీనికి ఏఈ, సబ్ ఇంజనీర్ నువ్వు ఎక్కడ ఉన్నావో చెప్పు నీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈఘటన బయటకు రావడంతో నగరవాసులు కూడా తాము కరెంట్ వాళ్లకు ఫోన్ చేస్తే సరిగా సమాధానం చెప్పడం లేదని పేర్కొంటున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.



ఉత్తములకు ప్రశంసపత్రాలు


జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌చంద్రకు ప్రశంస పత్రం అందజేస్తున్న మంత్రి

జిల్లాలోని వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి గురువారం జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హాజరై ప్రశంస పత్రాలను అందజేశారు.

\- ములుగు


రఫీక్ డీపీఆర్వో | అల్లెం అప్పయ్య డీఎంహెచ్‌ఓ | రాంపతి, సివిల్ సప్లయీస్ అధికారి | రాజ్‌కుమార్ సూపరింటెండెంట్


ఎస్పీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎస్పీ శబరీశ్


దేశీరాం, ఏటీడబ్ల్యూఓ | రవీందర్, తాడ్వాయి తహసీల్దార్ | విజయ్‌భాస్కర్ ములుగు తహసీల్దార్ | ప్రసాద్ కలెక్టరేట్ డీటీ | విజయ్‌కుమార్ ఎలక్షన్ డీటీ | సుధాకర్, ఆర్‌ఐ గోవిందరావుపేట | వెంకటేశ్వర్లు, వాజేడు హెల్త్ అసిస్టెంట్ | హర్షద్ అహ్మద్ ఎన్పీడీసీఎల్ ఏఈ | సుబ్బారావు ఏఎస్సై | శ్రీను, కానిస్టేబుల్ ఏటూరునాగారం


విశాల్, కలెక్టరేట్ కంప్యూటర్ ఆపరేటర్ | రాజు, ఆర్డీఓ కార్యాలయ ఈఆర్ఓ | సతీశ్, కానిస్టేబుల్ ఏటూరునాగారం | రుద్రారపు సురేశ్ వాజేడు ఎస్సై | దేవేందర్ ఈడీఎం | ప్రియాంక, ఏఈఓ ఏటూరునాగారం | నరేశ్, కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్ | శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ సీసీ | నాగరాజు కలెక్టర్ సీసీ | శశికాంత్ అడిషనల్ కలెక్టర్ సీసీ


రామకృష్ణ, కలెక్టరేట్ హెచ్‌హెచ్‌పీ | శ్రీనివాస్, ములుగు జోన్ ఇంటెలిజెన్స్ | ముషాంక్, ఆర్డీఓ కార్యాలయ దఫేదార్ | శంకరయ్య, ములుగు డీసీఆర్బీ ఏఎస్సై | కమలాకర్ పస్రా ఎస్సై | వెంకన్న హెడ్‌కానిస్టేబుల్


కోర్టు ఆవరణలో జెండా వందనం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ


వ్యవసాయశాఖ స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క


నితీశ్, సివిల్ సప్లయీస్ డీటీ | అజయ్‌కుమార్ పీఆర్ ఈఈ | జయరాజ్ మైనింగ్ ఏడీ | డాక్టర్ పవన్‌కుమార్ కొడిశాల పీహెచ్‌సీ


గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి



మేలిమి ఆశ చూపి.. నకిలీ బంగారం అంటగట్టి

- డబ్బులు దండుకుని ఉడాయించిన వ్యక్తులకు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత


ఉడాయించిన ఇద్దరిని (కూర్చున్న వారు) ప్రశ్నిస్తున్న బాధితుడు

బయ్యారం: మాయమాటలతో మేలిమి చూపి..ఆ తరువాత నకిలీ బంగారం కుదవపెట్టి డబ్బులు తీసుకున్న ఇద్దరు వ్యక్తులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం బయ్యారంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం రాజోలుకు చెందిన కలకోటి రాము అదే గ్రామంలో బాలా జీ సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మూడునెలల క్రితం రాజస్తాన్‌కు చెందిన గణేశ్, క్రాంతిలాల్, తదితరులు సూపర్‌మార్కెట్‌కు వెళ్లి సరుకులు కొనుగోలు చేశారు. ఈ సమయంలో తమకు బంగారం గొలుసు దొరికిందని రాముకు చెప్పి గొలుసులోని చిన్న ముక్క ఇవ్వగా అతను మహబూబాబాద్‌లో నాణ్యత పరీక్షించుకుని బంగారంగా నిర్ధారించుకున్నాడు. ఆ తరువాత కొన్ని రోజులకు గొలుసుతో రాము వద్దకు వచ్చిన రాజస్తాన్ వాసులు తమకు డబ్బులు అవసరం ఉన్నాయని, రూ. రెండు లక్షలు ఇస్తే సుమారు 8 తులాల బంగారం గొలుసు ఇస్తామని చెప్పారు. దీంతో రాము వారికి డబ్బులు ఇచ్చి గొలుసు తీసుకున్నాడు. అనంతరం గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి డబ్బులు తీసుకుందామని రాము మహబూబాబాద్ వెళ్లగా అక్కడ పరీక్షించిన నిర్వాహకులు నకిలీ బంగారంగా గుర్తించారు. దీంతో రాము తనకు చిన్న బంగారం వస్తువు అందించి నకిలీ గొలుసు ఇచ్చి మోసగించిన ట్లు గుర్తించి వారి ఆచూకీ కోసం గాలిస్తున్నాడు. ఈ క్రమంలో బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో గణేశ్, క్రాంతిలాల్ సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకుని వారిని పట్టుకున్నారు. ఈ సమయంలో కొందరు వ్యక్తులు వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

వరంగల్ రీజియన్‌ను అగ్రగామిగా నిలపాలి

- ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను


జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడుతున్న ఆర్‌ఎం డి.విజయభాను

హన్మకొండ: లాభాల్లో వరంగల్ రీజియన్‌ను అగ్రగామిగా నిలపాలని ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను అన్నారు. గురువారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు కష్టపడుతున్నారన్నారు. ప్రయాణికుల ఆదరాభిమానాలు చూరగొంటూ కార్పొరేషన్‌లో వరంగల్ రీజియన్‌ను ఆదాయంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. వరంగల్-2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, అసిస్టెంట్ మెకానికల్ ఈ.అమల, వరంగల్-2 డ్రైవర్ బి.వెంకన్న, వరంగల్-1 డిపో డ్రైవర్ ఎ.రమేశ్, మహబూబాబాద్ డ్రైవర్ వి.శ్రీనివాస్, హనుమకొండ డిపో కండక్టర్ జి.సరళాదేవి, మెకానిక్ జి.దేవేందర్‌కు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు కె.భానుకిరణ్, జి.మాధవరావు, అకౌంట్స్ ఆఫీసర్ ఎ.రవీందర్, పర్సనల్ ఆఫీసర్ రామ్మోహన్ రావు, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటి భోజనానికి..
భారత సర్కారు గుర్తింపు

నర్సంపేటలోని ఉప్పలయ్య హోటల్‌కు జాతీయ ప్రశంస


నర్సంపేట పట్టణంలోని ఉప్పలయ్య హోటల్



ఉప్పలయ్య హోటల్‌కు వచ్చిన సర్టిఫికెట్

నర్సంపేట: ఫైవ్ స్టార్ హోటళ్లు ఎన్ని ఉన్నా.. రుచికరమైన ఇంటి భోజనం ఎక్కడ దొరికితే అక్కడికి భోజన ప్రియులు పరుగెత్తుతారు. అటువంటి ఇంటి భోజనం లభిస్తున్న ఓ చిన్న హోటల్‌కు భారత సర్కారు గుర్తింపు లభించింది. ఇప్పుడు ఆ హోటల్ పేరు సామాజిక మాధ్యమాల్లో మార్మోగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ముప్పై సంవత్సరాల క్రితం ఉప్పలయ్య తన ఇంట్లోనే (ఉప్పలయ్య హోటల్) మెస్‌ను ప్రారంభించారు. తక్కువ ధరకే ఇంటి భోజనాన్ని అందించడంతో భోజన ప్రియులు విపరీతంగా వచ్చేవారు. కొంతకాలం తరువాత ఉప్పలయ్య అనారోగ్యంతో చనిపోయారు. ఆ తర్వాత హోటల్‌ను తన కుమారుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నడిపిస్తూ వస్తున్నారు. కుటుంబ సభ్యులు మొత్తం హోటల్ నిర్వహణ చూసుకుంటున్నారు. రుచిలో ఏ మాత్రం తేడా రాకుండా తన తండ్రి ఏ విధంగా లాభాపేక్ష లేకుండా నడిపించాడో కుమారుడు శ్రీనివాస్ కూడా అలాగే నడిపిస్తున్నాడు. ఈ హోటల్‌కు రోజూ సుమారు 200మందికిపైగా వచ్చి భోజనం చేస్తున్నారంటే రుచి ఎలా ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు.

జాతీయ గుర్తింపు ఎలా వచ్చిందంటే..

ఈ హోటల్‌లో వెజ్, నాన్‌వెజ్ తక్కువ ధరలో అందిస్తున్నారు. వినియోగదారుడి ధరకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలుసుకున్న భారత ప్రభుత్వం(మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) నుంచి రీజనల్ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ సభ్యులు రెండు నెలల కిందట ఈ హోటల్‌కు వచ్చి భోజనం చేసి బాగుందని చెప్పి వెళ్లిపోయారు. ఈ నెల 12(సోమవారం)న మరోసారి హోటల్‌కు వచ్చి మీ హోటల్‌కు అవార్డు వచ్చిందని చెప్పి శ్రీనివాస్‌కు సర్టిఫికెట్ అందజేశారు. ఇదే నాణ్యతను కొనసాగిస్తూ భోజన ప్రియులకు నాణ్యమైన, రుచికర భోజనాన్ని అందించాలని అభినందించారు.

మంచి పేరు కోసమే..



హోటల్ పెట్టినప్పటినుంచి మా ఇంట్లోనే భోజనాలు ఏర్పాటు చేసేవాళ్లం. నాణ్యతతోపాటు తక్కువ ధరలకు భోజనం అందిస్తూ వచ్చాం. హోటల్‌కు వచ్చే వాళ్లకు మంచి రుచితో కూడిన భోజనాలు అందించాలని మా నాన్న ఉప్పలయ్య చెప్పేవారు. ఆయన అదే విధంగా చాలా సంవత్సరాలు నడిపించారు. నాన్న చూపిన బాటలోనే హోటల్‌ను నడిపిస్తున్నాం. దీని ద్వారానే జాతీయ స్థాయి అవార్డు లభించింది..పెద్ద పెద్ద హోటళ్లకు దక్కని అవార్డు మా హోటల్‌కు లభించడం సంతోషకరంగా ఉంది.

\- జల్ల శ్రీనివాస్, ఉప్పలయ్య హోటల్ నిర్వాహకుడు, నర్సంపేట

ప్రాణాపాయం నుంచి గట్టెక్కారు..

- కారు డోర్ లాక్..వాహనంలోనే చిన్నారులు
- అర్ధగంటకు పైగా భయానక వాతావరణం
- మెకానిక్ సాయంతో తెరుచుకున్న డోర్‌లు
- ఊపిరిపీల్చుకున్న తల్లిదండ్రులు


సుబేదారిలో కారులో ఉన్న ఇద్దరు పిల్లలను బయటకు తీస్తున్న స్థానికులు

హన్మకొండ అర్బన్: తల్లిదండ్రులు తమ ఇద్దరు చిన్నారులను కారులో వదిలి మందుల కొనుగోలు నిమిత్తం మెడికల్ షాపునకు వెళ్లారు. అనుహ్యంగా కారు డోర్ లాక్ అయింది. దీంతో అర్ధగంటకు పైగా భయానక వాతావరణం నెలకొంది. కొత్తూరు జెండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీకాంత్, శ్రావణి దంపతులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిలకించడానికి గురువారం కారులో పుర వీధుల్లోకి వచ్చారు. జెండా వందనాలు చూసిన అనంతరం సుబేదారిలోని 'ఏ టు జెడ్' మెడికల్ షాపులో మందులు కొనడం కోసం కారులో నుంచి దిగారు. ఆ సమయంలో కారులో ఉన్న తాళంతో పిల్లలు డోర్ లాక్ చేశారు. బయటకు వచ్చిన తల్లిదండ్రులు కారు డోర్ తెరవడానికి యత్నించి విఫలమయ్యారు. లోపల ఉన్న పిల్లలకు ఊపిరి తీసుకోవడం కష్టమవుతుందని ఆందోళన చెంది వెంటనే మెకానిక్‌కు ఫోన్ చేస్తూ స్థానికుల సహకారంతో కారు డోర్ తెరవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో అర్ధగంట తర్వాత మెకానిక్ వచ్చి కారు డోర్‌లు తెరవడంతో పిల్లలు బయటకు వచ్చారు. దీంతో చూపరులతో పాటు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

పోడుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు

భూపాలపల్లి : అటవీ భూమిని నరికి పోడు చేసేందుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ బస్వ నరేశ్ తెలిపారు. ఎఫ్ఆర్‌ఓ కథనం ప్రకారం.. రాంపూర్ నార్త్ 4వ బీట్‌లోని రక్షిత అటవీ ప్రాంతంలో ఒకరు చెట్లు నరుకుతున్నట్లు గురువారం సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకుని చెట్లు నరుకుతున్న సింగరవేణి నరేందర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిని విచారించగా తాను కూలీ పని నిమిత్తం వచ్చానని, సింగరేణి భూపాలపల్లి ఏరియాలో పని చేసే టి. రఘోత్తంరెడ్డి 20 ఎకరాల భూమి చదును చేసేందుకు రూ. 40 వేలు ఇస్తానని చెప్పినట్లు తెలిపాడన్నారు. దీంతో రఘోత్తంరెడ్డిని కూడా అదుపులోకి తీసుకుని విచారించగా, తాను నాగారం చెందిన మధ్యవర్తుల ద్వారా ఆ భూమిని కొనుగోలు చేశానని వెల్లడించారన్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌ఓ వెల్లడించారు. అటవీ భూమిని ఎవరూ కొనుగోలు చేసి మోసపోవద్దని, అడవిలో చెట్లు నరికినా, పోడుకు ప్రయత్నించినా చర్యలు తప్పవని ఎఫ్ఆర్‌ఓ నరేశ్ హెచ్చరించారు.

తన వద్దకు అమ్మమ్మ రావడం లేదని..

- మనస్తాపంతో యువతి ఆత్మహత్య
- భీమదేవరపల్లిలో ఘటన


నిఖిత మృతదేహం

ఎల్కతుర్తి: తన వద్దకు అమ్మమ్మ రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం భీమదేవరపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మారుపాటి నిఖిత(22) కేయూలో పీజీ చదువుతుంది. నిఖితకు అమ్మమ్మ అంటే చాలా ఇష్టం. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్సపల్లికి చెందిన నిఖిత అమ్మమ్మ కొంతకాలంగా నిఖిత ఇంటికి రావడం లేదు. ఈ ఘటనపై అమ్మమ్మ ఇంటికి ఎందుకు రావడం లేదని కుటుంబీకులను అడుగుతూ బాధపడుతుండేది. ఈ క్రమంలో ఈనెల 14న పరీక్ష రాసేందుకు వెళ్లిన నిఖిత. సాయంత్రం ఇంటికి చేరుకుంది. రాత్రి తండ్రి మహేందర్‌రెడ్డి, తల్లి సుమతి, అక్క ప్రియదర్శినితో కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రించడానికి తన రూమ్‌లోకి వెళ్లింది. తెల్లారినా నిఖిత నిద్ర నుంచి లేవక పోవడంతో తండ్రి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో రూమ్‌కు వెళ్లి తలుపు కొట్టగా ఎంతకూ తీయలేదు. మహేందర్ రెడ్డి తన స్నేహితుడితో కలిసి బలవంతంగా తలుపు తీయగా నిఖిత ఉరేసుకుని కనిపించింది. ఈ ఘటనపై మహేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్.. మహేందర్‌రెడ్డి ఇంటికి చేరుకుని కుటుంబీకులను ఓదార్చారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

చిల్పూరు: కుటుంబ కలహాలతో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కలకోళ వెంకటేశ్(36) హైదరాబాద్‌లోని ఇంట్లో గురువారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్ మృతితో కుటుంబంతోపాటు కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య జ్యోతి, ముగ్గురు కుమారులు ఉన్నారు.